హైదరాబాద్ వార్త

# లబ్ధిదారుల ఎంపికలో ఆలస్యం తగదు

**-అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి త్వరగా పూర్తి చేయాలి**
**- అధికారులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం**


సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హరిచందన తదితరులు

**హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల లబ్దిదారులు ఎంపికలో జిల్లా అధికారులు వెనకబడి ఉన్నారని అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి ఎంపిక త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఈమేరకు మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నూతన రేషన్‌కార్డులు పంపిణీ, సీజనల్‌వ్యాధులను అరికట్టడంపై తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనికి కలెక్టర్ దాసరి హరిచందనతోపాటు వివిధ విభాగాలు అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా 10సంవత్సరాల తర్వాత రేషన్‌కార్డులు ఇవ్వడం జరుగుతుందని ఈప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులందికీ రేషన్‌కార్డు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అలాగే రేషన్‌కార్డుల్లో పేర్లు మిస్‌అయినా వారిని కూడా యాడ్ చేస్తున్నామన్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల లబ్దిదారులు ఎంపికలో జాప్యం జరిగిందని జిల్లాలో ఉన్న 15 నియోజకవర్గాలకు 15మంది ప్రత్యేక ఇంచార్జ్‌లను వేసి వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 43,115 కార్డులు కొత్తగా పంపిణీకి సిద్దంగా ఉన్నాయని ఇంకా లక్ష వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే హైదరాబాద్ జిల్లాలో ఎంపిక ప్రక్రియ మరింత ఆలస్యం అవుతుందన్నారు. సివిల్ సప్లయ్, రెవెన్యూ,జిహెచ్‌ఎంసిలు సమన్వయం చేసుకని వెరిఫికేషన్ పూరినత చేయాలని సూచించారు.

**సీజనల్ వ్యాధుల పై ప్రత్యేక ఫోకస్ పెట్టండి**

జిల్లాలో అధిక వర్షాలు కురుస్తుండటంతో వ్యాధులు ప్రబలి నష్టం జరగకుండా ముందస్తుగా శాంపిల్స్ స్వీకరించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలని మంత్రి వైద్యాధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో డెంగ్యూ మలేరియా సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులతో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జిల్లాలో డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించాలన్నారు. హై రిస్క్ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక ఫోకస్ పెట్టాలని ముఖ్యంగా రాపిడ్ టెస్టులు కాకుండా శాంపిల్ టెస్ట్ చేపట్టాలని అన్నారు. అదేవిధంగా 91 పీహెచ్సీలు, 169 బస్తీ దవఖానాలలో వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందాలని ఆదేశించారు. స్లం ఏరియాలలో ఎక్కువగా వైద్య క్యాంపులు చేపట్టి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటి, జిల్లా టీవీ నివారణ అధికారి డాక్టర్ చల్లా దేవి, డిప్యూటీ డిఎంహెచ్ఓలు, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

# 'కల్తీ'గాళ్లు..!

**రెచ్చిపోతున్న లిక్కర్ మాఫియా..**
**ఖరీదైన మద్యంలో నాసిరకం మిక్సింగ్**
**శివారు ప్రాంతాలే అడ్డాలుగా సాగుతున్న దందా**



**హైదారాబాద్, జూలై 22,ప్రభాతవార్త:** నగరంలోని కొన్ని మద్యం దుకాణాల్లో ఖరీదైన మద్యాన్ని దర్జాగా కల్తీచేస్తున్నారు.కంపెనీ,ఎక్సైజ్ శాఖ సీల్‌ను ఏ మాత్రం కదలించకుండా అందులోని మద్యాన్ని చాకచక్యంగా కొంత తీసి.. ఆభాగాన్ని ఛీప్‌లిక్కర్‌లతో నీళ్లను కలిపి విక్రయిస్తున్నారు. ఖరీదైన మద్యం తాగుతున్నామని ఫీలయ్యే వారు ఇలాంటి కల్తీ మద్యం బారిన పడి ఆరోగ్యాన్ని డబ్బును కోల్పోతున్నారు.ఇటీవల నగర శివారు ప్రాంతాల్లోనే ఇలాంటి కేసులు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయి. వైన్‌షాపులు నిర్వహించే పర్మిట్‌రూముల్లో, బార్లలో ఇలాంటివి ఎక్కువగా జరుగుతన్నాయి. తాజాగా నకిలీ విస్కీ బ్రాందీ వస్తువులను తయారు చేస్తున్న ఓముఠా సభ్యులను ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉప్పల్ కేంద్రంగా నడుస్తున్న ఓ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో అత్యంత ప్రమాదకరమైన స్పిరిట్‌ను ఉపయోగించి నకిలీ విస్కీ, బ్రాంది తయారు చేస్తున్న ముఠాను ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ముఠా తెలంగాణలో కల్తీ సరుకును తయారీ చేసి రెండు తెలుగు రాష్ట్రల లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. శానిటైజర్ తయారీ కోసం తీసుకున్న స్పిరిట్‌ను వినియోగించి మద్యం తయారీకి ఉపయోగిస్తున్నట్లు తేల్చారు.

**మూతలు కొట్టేందుకు ప్రత్యేక సిబ్బంది..**

మూతలు కొట్టడంలో నైపుణ్యం కలిగినవారు రూ.600 విలువైన బాటిళ్ల నుండి మొదలుకొని ఖరీదైన బాటిళ్ల వరకు కల్తీ చేస్తు ంటారు. అయితే బార్లలో ఐబి,ఒసి ఫుల్‌బాటిళ్ల నుండి మద్యాన్ని తీసి ఖరీదైన బాటిళ్లలోకలుపుతూ కల్తీకి పాల్పడు తున్నారు. మరికొన్ని బార్లలో ఏకంగా బాటిళ్లలో వేరే కంపెనీకి చెందిన మద్యం కాకుండా మినరల్ వాటర్ కలుపుతూ యథేచ్ఛగా కల్తీకి పాల్పడుతూ మద్యం ప్రియులు జేబులకు చిల్లు పెడుతున్నారు. వైన్స్‌ల్లో మూతలు కొట్టే ఆనవాయితీ ఇటీవల కాలంలో బార్లకు ఎగబాకింది. అయితే నగర శివార్లలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించు కుంటున్నారు. రాత్రి సమయాల్లో ఇద్దరుచొప్పున మూతలు కొట్టేవిధుల్లో ఉంటున్నట్లు సమాచారం.కల్తీ చేసిన మద్యాన్ని చాలా చాకచక్యంగా మందుబాబులకు అంటగడుతున్నారు. మొదటి రౌండ్‌లో కోరుకున్న మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. రెండోరౌండ్ కోరితే ఒరిజినల్ లిక్కర్‌లో కొంత మొత్తాన్ని కల్తీచేస్తారు.మూడో రౌండ్‌కోరుకున్న వారికి దాదాపు కల్తీ మద ్యం లేదా వేరేబ్రాండ్‌లను సరఫరా చేస్తున్నారన్న ఆరోణలు వినిపిస్తున్నాయి. కల్తీ మద్యం వ్యవహారాలను అరికట్టేందుకు తరుచుగా తనిఖీలు నిర్వహించాలి. వైన్‌షాపుల్లో మద్యం శాంపిళ్లు తీసి ల్యాబ్‌ల్లో పరీక్ష చేయించాలి. మరోవైపు నకిలీ మూతల తయారీదారులు,పంపిణీ దారులపై కఠినచర్యలు తీసుకోవాలి.

అక్రమాలకు పాల్పడే మద్యం వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కానీ ఎక్సైజ్ శాఖలో ఈతరహా చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల అండ దండలు,మూమూళ్ల వ్యవహారాలే ఈ నిర్లక్ష్యానికి కారణమేమోనన్న ఆరోపణలు వినిసిస్తున్నాయి.

# వరద నీరు సాఫీగా వెళ్లేలా హైడ్రా చర్యలు

**-రోడ్లు, ఫ్లైఓవర్లపై నిరంతరం పర్యవేక్షణ**


నాలాల వద్ద క్లీనింగ్ పనులు చేస్తున్న హైడ్రా సిబ్బంది

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** వర్షం పడితే వరద ముంచెత్తకుండా హైడ్రా నిరంతరం చర్యలు తీసుకుంటోంది. ఆర్‌యూబీలు, వంతెనలను పరిశీలించి ఎక్కడా నీరు నిలవకుండా జాగ్రత్త పడుతోంది. గత రెండు మూడు వర్షాలు నేర్పిన పాఠాలను హైడ్రా ఆకలింపు చేసుకుంది. వరద నివారణ చర్యలను ముమ్మరం చేసింది. వంతెనలపైన నీరు వెళ్లేందుకు ఉన్న రంధ్రాలను తెరిపిస్తోంది. కొండాపూర్‌లోని కొత్తగూడ వంతెన, అఫీజ్‌పేట్ వంతెనలపైన ఉన్న రంధ్రాలన్నీ తెరిచింది. అలాగే నగరంలోని అన్ని వంతెనలపైన నీరు నిలవకుండా చర్యలు తీసుకుంది. మదీనగూడ దగ్గర నాలా క్లీనింగ్ పనులు చేశారు. ఆర్‌యూబీల వద్ద సంపులు నిర్మించి ఆటోమేటిక్‌గా నీటిని తోడే వ్యవస్థను ఏర్పాటు చేశారు. అవి కొన్ని చోట్ల పని చేయకపోవడం... సామర్థ్యానికి మించి వరద నీరు రావడంతో తలెత్తిన ఇబ్బందుల పరిష్కారంపై హైడ్రా దృష్టి పెట్టింది. మంగళవారం మెహిదీపట్నం, మాధాపూర్ ప్రాంతాల్లో వర్షం పడుతున్నప్పుడు హైడ్రా ఎమర్జన్సీ, డీఆర్ఎఫ్ బృందాలు క్షేత్రస్థాయిలో ఉండి.. వరద నిలవకుండా చర్యలు తీసుకున్నాయి. అలాగే చింతల్, ఎల్‌బీనగర్ ఆర్‌యూబీలను కూడా హైడ్రా అధికారులు పరిశీలించారు. కాటేదాన్ అండర్ పాస్ (ఆర్‌యూబీ) వద్ద నీరు నిలవకుండా తీసుకోవాల్సిన చర్యలను అధ్యయనం చేశారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య గారు, ఆర్‌ఎఫ్‌వో జయప్రకాష్, డీఎఫ్‌వో యజ్ఞనారయణ తదితరులు క్షేత్ర స్థాయిలోపనులను పరిశీలించారు.

# దంచికొట్టిన వాన..

**-వాహనదారులకు తప్పనితిప్పలు**





**హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త:** నగరంలో మంగళవారం ఒక్కసారిగా వాతావరణం మారింది.మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టాయి..సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. సిటీ మొత్త మేఘలు కమ్ముకున్నాయి. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడ మోస్తరు వర్షం కురవగా సాయంత్రానికి పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, ఖైరతాబాద్ లలో భారీ వర్షం కురిసింది. దిల్ సుఖ్ నగర్, చైతన్యపురిలో మోస్తరు వాన కురిసింది. కిషన్ పురా, హైదర్ కోట్, నార్సింగ్ ప్రాంతాల్లో కూడా వర్ష కురిసింది.ఎల్బీ నగర్ లో వాన దంచికొట్టింది. మరోవైపు శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్ లలో జోరువాన కొట్టింది. రాజేంద్ర నగర్, అత్తాపూర్, బండ్లగూడలో మోస్తరు వానపడింది.నాంపల్లి, మెహదీపట్నం, మాసబ్ ట్యాంక్ ఏరియాల్లో కూడా వాన పడింది.

# వాటర్‌లాగిన్ పాయింట్‌లపై దృష్టిపెట్టాలి

**-ఇంజనీరింగ్ అధికారులకు కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశం**


నీళ్ల నిలిచే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ తదితరులు

**హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త:** నగరంలో వర్షాల వల్ల నీరు నిలిచే వాటర్ లాగింగ్ పాయింట్ ల పై స్పెషల్ ఫోకస్ పెట్టాలనీ జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ సెంట్రల్ జోన్ చీఫ్ ఇంజనీర్ రత్నాకర్ ను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్‌తో కలసి లక్డీకపూల్ వద్ద మెహదీ ఫంక్షన్ హాల్, పిటిఐ, చీచా రెస్టారెంట్ వద్ద వాటర్ లాగింగ్ పాయింట్‌ను పరిశీలించారు.అప్పటికే అక్కడ నిలిచిన వర్షపు నీరును ఇంజనీరింగ్ అధికారులు తొలగించారు. అదే చోట ఇరుకుగా ఉండడం, రోడ్డు లెవెల్ డిఫరెన్స్ ఉండడంతో మెహదీపట్నం నుంచి వచ్చే వాహనాలు స్లోగా వెళ్లడం వల్ల ట్రాఫిక్ తరచుగా నిలిచిపోయి ఇబ్బందులు తలెత్తుతున్నాయనీ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈవిషయంపై తమతో ఉన్న సెంట్రల్ జోన్ చీఫ్ ఇంజనీర్ తో కమిషనర్ ఆర్‌వి కర్ణన్ చర్చించారు.సాధ్యమైనంత త్వరగా లెవెల్ డిఫరెన్స్ తొలగించడంతో పాటు సీసీ వేయాలనీ కమిషనర్ చీఫ్ ఇంజనీర్ ను ఆదేశించారు. అక్కడే అదనంగా మరో లేన్ వచ్చేలా చూడాలన్నారు. తద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

## కల్తీకల్లు బాధితులకు న్యాయం చేయాలి

**- ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆప్ నేతల వినతిపత్రం**


మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేస్తున్న సుధాకర్, నర్సింగ్, యమునాగౌడ్, విజయ్ తదితర ఆప్ సభ్యులు

**రవీంద్రభారతి, జూలై 22 ప్రభాతవార్త :** తెలంగాణలో కల్తీకల్లును అరికట్టి కల్తీకల్లు బారినపడిన బాధితులకు తగిన తక్షణ న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతికశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావుకు రవీంద్రభారతి ప్రాంగణం కళాభవన్‌లో మంత్రిని కలిసి ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్ నేతృత్వంలో ఆప్ ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. కల్తీకల్లు వినియోగం వల్ల సంభవించిన విషాద సంఘటనపై ప్రభుత్వం దృష్టిని పెట్టాలని, ప్రమాదకరమైన పానీయం ఫలితంగా పదిమందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, అనేకమంది ఆస్పత్రి పాలయ్యారని సుధాకర్ వాపోయారు. గత ప్రభుత్వం కల్లునిషేధాన్ని ఎత్తివేయడం వల్ల కల్తీకల్లు అమ్మకాలను పెట్టుబడిగాపెట్టే మద్యం మాఫియా ఆవిర్భావానికి దారితీసిందని చెప్పారు. కల్లీకల్లు బాధ్యులను కఠినంగా శిక్షించాలని, మరణించిన వారి కుటుంబాలకు 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కల్తీకల్లు ప్రభావిత బాధితులకు 5లక్షల సహాయం, ఆరోగ్య సహాయం అందించాలని డా. డి.సుధాకర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు ఎం.ఎ.మజీద్, నర్సింగ్, యమునాగౌడ్, విజయ్, డా. లక్ష్మనాయుడు, రమేష్, అజీమ్‌బేగ్, సుబ్బారావు, డా. అన్సారీ, రవీందర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో ఇద్దరికి రిమాండ్...


వివరాలను తెలుపుతున్న ఆసిఫ్ నగర్ ఏసీపి కిషన్ కుమార్...

**మెహిదీపట్నం, జులై 22, ప్రభాతవార్త :** ఓ యువకుడి హత్య కేసులో ఇద్దరిని రిమాండ్ కు తరలించిన సంఘటన ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఆసిఫ్ నగర్ ఏసీపీ కిషన్ కుమార్ వివరాలను విలేకరులకు వెల్లడించారు... ఆసిఫ్ నగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ కాబులా(22) సోఫా మేకర్. ఇతని మిత్రులు అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ వసీం, సమీర్ ఖాన్ లు పాత కక్షలు నేపథ్యంలో ఆదివారం రాత్రి కాబులా ను హతమార్చేందుకు పన్నాగం పన్నారు. అయితే ఆదివారం రాత్రి మద్యం సేవించిన కాబులాను వసీం, సమీర్ ఖాన్ లు కత్తితో పొడిచి బండరాయితో మోది హత్య చేసి పారిపోయారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సౌత్ వెస్ట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆధ్వర్యంలో నిందితులను ఇద్దరిని పట్టుకొని మంగళవారం రిమాండ్ కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. మహమ్మద్ వసీంకు గతంలో నేర నేపథ్యం ఉందని 307 ఐపిసి కింద కేసు నమోదు చేయబడిందని తెలిపారు. ఇన్స్పెక్టర్ ఆనంద్, డిఐ సంతోష్ కుమార్‌లు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద కత్తి పల్సర్ వాహనంతో పాటు మొబైల్ ఫోన్ కూడా స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రిమాండ్ కు తరలించినట్టు ఏసిపి తెలిపారు.

## ఒయు ప్రొ.మధుసూదన్ రెడ్డి మృతి

**-కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నివాళి**

**తార్నాక, జులై 22 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ వ్యక్తి, ఒ.యూ ప్రొఫెసర్ కె.మధుసూదన్ రెడ్డి మృతిచెందారు. నల్లగొండ జిల్లాలోని మర్రిగూడెం మండలం శివన్నగూడెం గ్రామానికి చెందిన వారు. ప్రస్తుతం ఆయన నగరంలోని నారాయణగూడాలో ఉంటున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్‌గా ఆయన విధులు నిర్వహించారు. తెలంగాణ సిద్ధాంతకర్తగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. మధుసూదన్ రెడ్డి మృతి పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆయన స్పందిస్తూ 1969 తొలి తెలంగాణ ఉద్యమానికి, తర్వాత 1996 నుండి 2014 వరకు జరిగిన తెలంగాణ సాధన ఉద్యమాలకు ఆయన ప్రేరణగా నిలిచినట్లు కొనియాడారు. ఆయన చేసిన అపారమైన కృషి తరతరాలుగా కో ట్లాది మంది విద్యార్థుల జీవితాల్లో మార్పులను తెచ్చిపెట్టిందన్నారు.

# అంటువ్యాధులు ప్రబలకుండా మెరుగైన సేవలు అందించాలి

**-ఆసుపత్రుల్లో వైద్యులు సమయపాలన పాటించాలి**
**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**


ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్, జులై 22,ప్రభాతవార్త:** జిల్లాలో వర్షాలు అత్యధికంగా పడుతున్నందున జ్వరాలు అంటువ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి వైద్యులను ఆదేశించారు. మంగళవారం నాంపల్లి క్లస్టర్ ఆఘాపురలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా వర్షాలు పడుతుందన్న డెంగ్యూ , మలేరియా అలాగే అంటు వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. అదేవిధంగా ఆరోగ్య మహిళా ప్రోగ్రాం కింద ప్రతి మంగళవారం మహిళలకు 8 రకాల పరీక్షలు అందుతున్నాయ అని వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. నాంపల్లి క్లస్టర్ కింద 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 13 బస్తీ దావఖానాలలో మందుల కొరత లేకుండా చూడాలని అలాగే వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలని అడిషనల్ డిఎం హెచ్ ఓ కు ఆమె ఆదేశించారు. వైద్యులు సమయపాలన పాటించాలని సూచిస్తూ ఆస్పత్రిలో ఓపి వివరాలు మెడికల్ స్టోర్, హాజరు పట్టిక, ఐ.ఆర్ ఎల్, డ్రస్సింగ్ గదులను ఆమె పరిశీలించారు. అదేవిదంగా ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు టీకాలతో పాటు పౌష్టికారం తీసుకునే విదంగా సూచించాలని, యోగా, వ్యాయామం చేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో వైద్య సదుపాయాలపై ఈ సందర్భంగా ఆమె అడిగి తెలుసుకున్నారు.

ఆసుపత్రిలోని గదులతో పాటు పరిసర ప్రాంతంలో ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ హేమ లత, మెడికల్ ఆఫీసర్ ఉమేరా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్జాదిగూడ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్

**- కమిషనర్ త్రిలేశ్వర్ రావు**

**మేడిపల్లి, జూలై 22 ప్రభాతవార్త ;** మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ నగర పాలక సంస్థమెప్మా సంయుక్త ఆధ్వర్యంలో జూలై 23 నుండి 25 వరకు బుద్దా నగర్ పార్కు ఆవరణలో ఎస్ హెచ్ జి ప్రొడక్ట్స్ మేళా , స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ ప్రోగ్రామ్‌ను నిర్వహించడం జరుగుతుంది.ఇందులో పట్టణ పరిధిలోని మహిళా సంఘాల సభ్యులు, వీధి విక్రయదారుల ఉత్పత్తులను విక్రయించనున్నారు . పట్టణ మహిళా సంఘాల మరియు స్ట్రీట్ వెండోర్స్ యొక్క ఉత్పత్తులను ప్రోత్సహించాలి అనే ప్రధాన ఉద్దేశంతో ఈయొక్క మేళాను ఏర్పాటు చేయటం జరుగుతుంది . ఇందులో పట్టణ పరిధిలోని మహిళా సంఘాలు తయారు చేసిన పిండి వంటలు, పచ్చళ్ళు, చిరుతిండ్లు, మిల్లెట్స్, ఆర్గానిక్ ప్రొడక్ట్స్ , అల్లికలు, చేతి వృత్తుల వస్తువులు, బ్యాగులు, బ్యాంగిల్స్, మొదలగు వస్తువులు విక్రయించబడును . కావున నగర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మేళాను విజయవంతం చేయగలరని కోరారు.

## నేత్రదానం మహాదానం : రేవ్ ఫాదర్ ఆంథోనీ



నిరుపేదలకు నేత్ర శస్త్ర చికిత్స చేసిన దృశ్యం...

**కుషాయిగూడ, జూలై 22, ప్రభాతవార్త :** నేత్రదానం మహాదానమని తద్వారా మానవులు మరో జీవిత కాలం జీవిస్తారని రేవ్ .ఫాదర్. ఆంథోని మదన్ పేర్కొన్నారు. జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ మోలాలి హౌసింగ్ బోర్డ్ సంజయ్ గాంధీ నగర్ కాలనీలో హైదరాబాద్ ఆతి మేత్రాసన సాంఘిక సేవా సంస్థ,ఉషోదయ ఐ హాస్పిటల్ ,డీకే బి డబ్ల్యు స్పాన్సర్షిప్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర చికిత్స శిబిరంలో సుమారు 270 మంది కుటుంబాలు పాల్గొనగా ,190 మంది పరీక్షలు నిర్వహించారు అందులో 20 మందికి కంటిచూపు కోల్పోయినట్లు నిర్ధారించారు.. కంటి చూపు కోల్పోయిన 20 మంది నిరుపేదలకు డీ కే బిడబ్ల్యు ఉషోదయ కంటి ఆసుపత్రి సంయుక్తాధ్వర్యంలో ఉచితంగా కంటి శాస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. తద్వారా కళ్ళు కోల్పోయిన 20 మంది మళ్లీ కళ్లను పొంది కంటి చూపు పొందగలిగారు. సందర్భంగా నిర్వాహకులు రేవు .ఫాదర్ .ఆంథోనీ మదన్ మాట్లాడుతూ చనిపోయిన తర్వాత నేత్రదానం అందించే కార్యక్రమం మరొకరి జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కార్డినల్ పూలా అంతోని ఉదాత్తమైన సహకారం మద్దతు మూలంగా ఈ చెత్త చికిత్స కార్యక్రమాన్ని నిర్వహించగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు వైద్యులు పాల్గొన్నారు.

## కెటీఆర్ నాయకత్వంలో అధికారంలోకి రావడం ఖాయం : పాండాల శివకుమార్



కేటీఆర్‌కు గిఫ్ట్ ఎస్ ఫైల్ కొరకు లక్ష రూపాయల విరాళం

**కుషాయిగూడ జూలై 22 ప్రభాతవార్త**

టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని తెలంగాణ ఉద్యమ నేత టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాండాల శివకుమార్ గౌడ్ పేర్కొన్నారు.అ కేటీఆర్ ప్రవేశపెట్టిన గిఫ్ట్ స్మైల్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ముందస్తుగా కేటీఆర్‌కు లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ చేపట్టిన అభివృద్ధిని ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని కేటీఆర్ లాంటి యువ నాయకుడు రాష్ట్రానికి ఎంతో అవసరం అన్నారు. హైదరాబాద్ లోని నంది నగర్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ చర్లపల్లి డివిజన్ సీనియర్ నాయకులు పాండల శివకుమార్ గౌడ్.అనంతరం గిఫ్ట్ ఏ స్మైల్ లో భాగంగా ఒక లక్ష రూపాయల(1,00,000/) చెక్కును కేటీఆర్ కి అందజేసారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ చర్లపల్లి డివిజన్ లో బిఆర్ఎస్ పార్టీని, కార్యకర్తలు కాపాడుకోవడం మరియు మీరు చేసే ప్రతి కార్యక్రమం పార్టీ దృష్టిలో ఉంది. రాబోయే రోజుల్లో పార్టీ మీకు తప్పకుండా సముచిత స్థానం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. కేటీఆర్ ని కలిసిన వారిలో నాగారం మున్సిపాలిటీ బిఆర్ఎస్ నాయకులు గూడురు మహేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## వెంకటేశ్వర నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



**మల్కాజిగిరి జూలై22,ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ పర్యటించారు.ఈ సందర్భంగా స్థానికులు పాడైన బోర్ మర్మతులు చేయించాలని ఐరన్ పోల్ షిఫ్ట్ చేయాలని కోరారు వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ నవీన్,ఎలక్ట్రికల్ ఏ ఈ గోపాల్, స్థానికులు నర్సింహ,సురేందర్, సురేష్, రాజేందర్,అశోక్,నరహరి, శ్రీనివాస్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు

## విజయదుర్గా మాతకు మంత్రి పొన్నం ప్రభాకర్ పూజలు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అమ్మవారి ప్రతిమను అందజేస్తున్న సునీల్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 22 ప్రభాతవార్త:** బోనాల పండుగను పురస్కరించుకుని సైదాబాద్ మాతా మైదానంలో కొలువుదీరిన శ్రీ విజయ దుర్గా మాతను మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటి ప్రతినిధి సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు



ఘటాల ఊరేగింపులో పోతరాజులతో ఉత్సవ కమిటి ప్రతినిధులు



దేవతా మూర్తుల వేషధారణల్లో చిన్నారులు

**సైదాబాద్, జూలై 22 ప్రభాతవార్త:** శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహంకాళి జాతర మహోత్సవాలలో భాగంగా అమ్మవారి ఘటాల ఊరేగింపును సోమవారం సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల సందడి, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు వైభవంగా కొనసాగింది. అమ్మవారి బోనం ఎత్తుకుని భక్తులు నృత్యాలు చేశారు. అనంతరం మార్కెట్ కూడలి వద్ద గావు పట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రద్ధాబాద్ మహంకాళి జాతర ఉత్సవ కమిటి చైర్మన్ సుభాష్ చందర్జీ, అధ్యక్షుడు కె.మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి రాంకుమార్‌లు మాట్లాడుతూ గత 47 సంవత్సరాలుగా శ్రద్ధాబాద్ మహంకాళి జాతర మహోత్సవాన్ని ప్రతి ఏటా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని అన్నారు. సైదాబాద్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన వేదికల నుంచి పలువురు నాయకులు ఘటాలకు స్వాగతం పలికారు.

**ప్రత్యేక ఆకర్షణగా మహనీయుల వేషధారణలు..**

ఊరేగింపులో దేవతా మూర్తుల, పౌరాణిక, సాంఘిక, స్వాతంత్ర్యోద్యమ మహనీయుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తి పాటలు, భజనలు, జానపద, భక్తి గేయాల హోరులో డప్పు వాయిద్యాలు, జయ జయ ధ్వనులతో పరిసరాలు మర్మోగాయి.

**మార్కెట్ చౌరస్తాలో అన్నదానం..**

సైదాబాద్ మార్కెట్ చౌరస్తాలో మంగళవారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమాలలో ఉత్సవ కమిటి ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ చందర్జీ, కోశాధికారి గౌలికార్ పూర్ణ చందర్, ఉపాధ్యక్షులు కూసూరు సహదేవ్ యాదవ్, గౌలికార్ దినేష్, కోళ్ల గోపి, జైల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దాశరథి జయంతి ఉత్సవం



**నేరెడ్ మెట్, జూలై 22 ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమ కవి, మహాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి ఉత్సవం మల్కాజిగిరిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలుగు విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకుల సమష్టి భాగస్వామ్యంతో ఉత్సాహంగా జరిపారు.ఉత్సవాలు తెలంగాణ జాతీయ గీతంతో ప్రారంభమయ్యాయి. అనంతరం విద్యార్థులు దాశరథి జీవిత చరిత్రను వివరిస్తూ, ఆయన రచనలు, తెలంగాణ ఉద్యమంలో పాత్ర, సామాజిక సందేశాలు వివరించారు. దాశరథి రచించిన ప్రసిద్ధ పద్యాలను విద్యార్థులు ప్రదర్శించగా, కొన్ని పాటలను గాత్రసాధనతో ఆలపించి భక్తిశ్రద్ధలతో భావోద్గారాన్ని నింపారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రాజు మాట్లాడుతూ...దాశరథి కవిత్వం సామాజిక చైతన్యానికి మార్గదర్శకంగా నిలిచింది. ఆయన జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం. ఇలాంటి సాహిత్య కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తే యువతలో చైతన్యం, భావజాలం పెరుగుతుంది" అని తెలిపారు. తెలుగు విభాగాధిపతి పప్పుల శైలజ దాశరథి రచనలపై కీలక అంశాలను తన ప్రవచనంలో ప్రస్తావించారు. కవితా శైలిపై విశ్లేషణాత్మకంగా వివరిస్తూ, విద్యార్థులకు సాహిత్యం పట్ల ఆసక్తి కలిగించేలా ఉద్దేశ్యపూర్వకంగా మాట్లాడారు.ఈ కార్యక్రమానికి విద్యార్థులు నవీన్, అజయ్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. అనంతరం తెలుగు అధ్యాపకులను ప్రిన్సిపాల్ మరియు ఇతర అధ్యాపకులు సన్మానించారు. ఈ ఉత్సవంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడవి రాజు, అకడమిక్ కోఆర్డినేటర్ గుణాకర్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్ కుమార్, డాక్టర్ శోభన్ బాబు, డాక్టర్ జగన్, డాక్టర్ వెంకట రెడ్డి, డాక్టర్ వినోద్, డాక్టర్ మల్లిక, డాక్టర్ అహల్య, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ యాదగిరి, డాక్టర్ హరిత, డాక్టర్ లలిత, డాక్టర్ స్వాతి పాల్గొన్నారు.

## తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు నిదర్శనం బోనాలు : సబిత



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న సబితాఇంద్రారెడ్డి

**ఎల్.బి.నగర్, జులై 22 ప్రభాతవార్త:** తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు బోనాల పండుగ నిదర్శనం అని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్‌లోని గ్రీన్‌హిల్స్‌కాలనీ మహిళా మండలి, కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన బోనాల జాతరలో సబితాఇంద్రారెడ్డి పాల్గొని శ్రీఖిల్లామైసమ్మ దేవాలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బోనాలతో సబితమ్మ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆషాఢ మాసంలో జరిగే బోనాల పండగకు ప్రత్యేకత ఉందని, తెలంగాణ రాష్ట్రమంత ఈ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని, మహిళలకు ఇది ప్రత్యేక పండగని అన్నారు. కోరిన కోర్కెలు తీర్చే దేవత శ్రీఖిల్లామైసమ్మ అమ్మవారు రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నాయకులు గొడుగు శ్రీనివాస్, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, కొంద్రాశ్రీనివాస్, లింగస్వామి గౌడ్, పుష్పలత రెడ్డి, దయాకర్‌రెడ్డి, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జ్యువెలరీ దుకాణాల యజమానులతో అవగాహన సమావేశం

**-సెక్యూరిటీ పరంగా జాగ్రత్తలు తప్పనిసరి**
**- ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్**



**నేరేడ్ మెట్, జూలై 22 ప్రభాతవార్త :** నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జ్యువెలరీ షాప్ యజమానులతో పోలీసులు సోమవారం ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఇటీవల సూర్యాపేటలో చోటు చేసుకున్న భారీ మోతాదులో ఆభరణాల దొంగతన ఘటనను ఉదాహరణగా తీసుకుని, నగల దుకాణాల యజమానులు తీసుకోవలసిన భద్రతా చర్యలపై సూచనలు చేశారు.ఈ సమావేశానికి పోలీస్ శాఖ అధికారులు, బీట్ కానిస్టేబుళ్లు, స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ తదితరులు హాజరై జ్యువెలరీ షాప్‌ల భద్రతా వ్యవస్థలపై సమగ్ర దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా సీసీ కెమెరాలు, అలార్మ్ సిస్టమ్స్, నైట్ వాచ్‌మెన్‌లు, ఎలక్ట్రానిక్ లాకింగ్ సిస్టమ్స్, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెలుతురు ఏర్పాట్లు వంటి అంశాల్లో విఫల మైతే, దొంగతనాలకు అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

**సెక్యూరిటీ మెజర్స్ అనుసరించాలి:**

సీసీటీవీ ఫుటేజ్‌ను కనీసం 30 రోజులు స్టోర్ చేయాలి.షాప్ మూసిన తర్వాత అలార్మ్ సిస్టం పని చేయాలని నిర్ధారించుకోవాలి.రాత్రి గడియల సమయంలో ప్రైవేట్ సెక్యూరిటీ లేదా నైట్ గార్డ్ తప్పనిసరిగా ఉండాలి.రోజువారి లావాదేవీలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి.అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## బడంగ్‌పేట్ అధికారుల నిర్లక్ష్యం మీర్‌పేట్ కాలనీలకు శాపం



కాలనీల్లో ప్రవహిస్తున్న మురికి నీరు



రోడ్లను ముంచెత్తుతున్న డ్రైనేజీ నీరు

**సరూర్‌నగర్, జూలై 22 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం దిగువన ఉన్న మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాలనీలకు శాపంగా మారుతున్నది. మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధికి ఆనుకొని ఎగువన ఉన్న బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిందకు వచ్చే కాలనీల్లోని బహుళ అంతస్తుల భవనాలు, ఇతర ఇళ్లకు సంబంధించిన డ్రైనేజీ లైన్ల వల్ల మీర్‌పేట్ కార్పొరేషన్ 28వ డివిజన్‌లోని టిఎస్ఆర్, శివసాయినగర్ కాలనీల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. తగిన సామర్థ్యం లేని డ్రైనేజీ పైప్‌లైన్లను ఏర్పాటు చేయడం వల్ల ప్రతి రోజూ మురికి నీరు ఇక్కడి కాలనీల్లో ప్రవహిస్తూ స్థానికులను చికాకుపరుస్తున్నాయి. బడంగ్‌పేట్ కార్పొరేషన్ 1వ డివిజన్ కిందకు వచ్చే టిఎస్ఆర్ నగర్ ఫేజ్-2లో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనాలకు సంబంధించిన డ్రైనేజీ కనెక్షన్లను కలపడంతో వాటి ప్రభావం టిఎస్ఆర్‌నగర్, శివసాయినగర్ కాలనీలపై పడుతోంది. ఇప్పటికే మ్యాన్‌హోళ్ళ నుండి డ్రైనేజీ నీరు ప్రవహిస్తుండడం వల్ల స్థానికంగా రోడ్లు దుర్గంధ పూరితంగా మారాయి.

**సమస్యకు పరిష్కారం చేయాలి**
**: మాజీ కార్పొరేటర్ అరుణ ప్రభాకర్‌రెడ్డి**

బడంగ్‌పేట్ కార్పొరేషన్ 1వ డివిజన్ కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మీర్‌పేట్ 28వ డివిజన్ మాజీ కార్పొరేటర్ జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఇక్కడ భారీ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతో వల్ల నిర్మాణాలు పూర్తి కాకముందు అక్రమంగా డ్రైనేజీ కనెక్షన్లు ఏర్పాట్లు చేసుకున్నట్లు అర్థం అవుతున్నదని ఆమె అన్నారు. తగిన సామర్థ్యం గల పైపులు ఏర్పాటు చేయనందునే అవి కాస్తా సరిపోక మ్యాన్‌హోళ్ళ నుండి డ్రైనేజీ నీరు లీకయి కాలనీల్లో ప్రవహిస్తున్నాయని ఆమె తెలిపారు. ఈ మేరకు బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధికారులు స్పందించిన మీర్‌పేట్ 28వ డివిజన్‌లో డ్రైనేజీ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

## డ్రైనేజీ సమస్య లేకుండా చర్యలు : కార్పొరేటర్



సమస్యను తెలుసుకుంటున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, జులై 22 ప్రభాతవార్త :** నాచారం డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ శాంతి సాయిజన్‌శేఖర్ తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తగా నీళ్లు నిలిచే అవకాశం ఉన్న ప్రతి మ్యాన్ హోల్ లో ఉన్న పూడికను హైడ్రా సిబ్బందిచే తొలగించే పనులు ప్రతిరోజు చేయించడం జరుగుతుందన్నారు. నాచారంలో గతంలో ఎన్నడూ కూడా ఇంత క్రమశిక్షణతో ప్రతిమ్యాన్ హోల్‌కవర్‌లలో పేరుకుపోయిన మట్టి తొలగిస్తూ పూడికను కూడా తొలగించడం జరుగుతోందని చెప్పారు. ప్రతిరోజు హైడ్రా సిబ్బందికి డివిజన్లో ఎక్కడెక్కడ సమస్యాత్మక ప్రదేశాలు చూపించి జాగ్రత్తలు తీసుకోవడం తీసుకుంటున్నామని కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు సాయిజెన్‌శేకర్, వాసు హైడ్రా సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలపై జెడ్‌సీకి ఎమ్మెల్యే బీఎల్ఆర్ వినతి



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఇతర నాయకులు

**నాచారం, జూలై 22 ప్రభాతవార్త :** జిహెచ్ఎంసి ఎల్బినగర్ ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి కలిసి స్థానిక సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు.మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఓల్డ్ మల్లాపూర్, వెంకటరమణ కాలనీ, బ్రహ్మపురి కాలనీ, బాబానగర్ కాలనీ, బాబానగర్ (నాచారం) కాలనీలల్లో సీసీ రోడ్లు,మల్లాపూర్ ఎన్ఎఫ్‌సిఓవర్ బ్రిడ్జి నిర్మాణపు పనుల కోసం తగిన చొరవ చూపాలని ఎమ్మెల్యే కోరారు. బ్రిడ్జి కొరకు కావాల్సిన నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు.అందుకు సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సాయి జెన్ శేఖర్ పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల్లో భక్తుల ఉత్సాహం



**నేరెడ్ మెట్ జూలై 22 ప్రభాతవార్త:** సఫిల్గూడ శ్రీ శ్రీ శ్రీ విజయదుర్గ కట్ట మైసమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఇప్పటి వరకు దాదాపు 35 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, బోనాలు సమర్పించి, అమ్మవారి కృప ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదానం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా స్థానిక కార్పొరేటర్ ఉరవల్లి శ్రావణ్ హాజరై భక్తులకు స్వయంగా అన్నం వడ్డిస్తూ సేవా దృక్పథాన్ని చాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మల్కాజిగిరి ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. వర్షాలు సకాలంలో కురిసి రైతుల కష్టాలు తీరాలి. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, సన్నిహిత వాలింటర్లు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదానం అనంతరం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ బోనాల సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలన్నీ దీపాలతో, హరితపటాలతో శోభాయమానంగా కనిపించాయి. ఉత్సవాల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఈ విజయవంతమైన నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న డాక్టర్ విజయరంగ

**ఎల్.బి.నగర్, జులై 22 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువు పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని డాక్టర్ బి.విజయరంగ పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం సమీపంలోని ఆదర్శ బాలుర హోమ్ విద్యార్థులకు మంగళవారం లైన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట శాఖ ఆధ్వర్యంలో విజయరంగ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు అవసరమైన 100 నోటు పుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది అన్నారు. అనాథ బాలురకు విద్యా సాధనలో కొంత సహాయంగా ఉండాలని నోట్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. సేవా దృక్పథంతో లయన్స్‌క్లబ్ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కే.తిరుమలరెడ్డి, పద్మావతి సహకారం అందించారని తెలిపారు...



బోనాల పండుగను పురస్కరించుకుని సైదాబాద్‌లోని జీవనజ్యోతి సంఘం శ్రీ జయదుర్గా మాత దేవాలయంలో పూజలు చేస్తున్న సైదాబాద్ ఎసిపి వెంకట్‌రెడ్డి

## స్వల్ప విషయంపై ఘర్షణ.. పలువురికి గాయాలు

**మలక్ పేట ,జూలై 22, ప్రభాతవార్త:** స్వల్ప విషయంపై వివాదం తలెత్తగా , కర్రలు రాడ్లతో పలువురు పై దాడి చేయడంతో నాలుగు వ్యక్తులు గాయాల గురైన సంఘటన మలక్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం... గడ్డి అన్నారం బస్తికి చెందిన అభిలాష్, హరి శంకర్, అరవింద్, విశ్వేశ్వర్ తదితరులు బస్తి దవాఖానా సమీపంలో కూర్చుని మాట్లాడుతుం డగా ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చిన అదే ప్రాంతానికి చెందిన సాయి మరో వ్యక్తిల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో ఇరువురి మధ్య రాజీ కుదర్చడానికి స్నేహితులు ప్రయత్నం చేసిన సయోధ్య కుదరలేదు. దీంతో అక్కడి నుంచి వెళ్ళిపోయారు. అనంతరం నరేష్ అలియాస్ నాచ్, బాబుల్లా, వంశీ, సురేష్ ,లిటిల్, రంజిత్ మరికొందరు రాడ్స్, కొర్రలతో వచ్చి వారిపై దాడి చేశారు. ఈ దాడులలో హరిశంకర్ తలపై, మెడకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మిగతా వారికి కూడా గాయాలయ్యాయి దీంతో బాధితులు మలక్ పేట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బోనాల పండుగ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి

**: ఆలయ చైర్మన్ మాదాసు కామేష్**



అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు

**మలక్ పేట ,జూలై 22 , ప్రభాతవార్త:** బోనాల పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని ఓల్డ్ మలక్పేట దోబి గల్లి నల్ల పోచమ్మ దేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ మాదాసు కామేష్, మాదాసు మహేష్ బాబులు పేర్కొన్నారు. నల్ల పోచమ్మ దేవాలయంలో వారి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు మేళతారాలు డప్పు వాయిద్యాలు అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని కనుల పండుగ నిర్వహించారు స్థానిక ప్రజలు అమ్మవారి ఘటాలకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి బోనాల ఉత్సవాలు, ఘటాల ఊరేగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూలి శ్రీధర్, దానకర్ణ చారి, శ్రీధర్ రెడ్డి, మంచి కంటి జగన్ గుప్తా, ఫైబర్ టెల్ రాజు తదితరులు పాల్గొన్నారు.


## విలువలతో కూడిన రాజకీయాలతో ప్రజలకు సేవలందించిన నేత అచ్చుతానందన్



కేరళ మాజీ సిఎం అచ్యుతానందన్‌కు నివాళులర్పిస్తున్న మీర్‌పేట్ సిపిఎం నాయకులు

**సరూర్‌నగర్, జూలై 22 ప్రభాతవార్త:** జీవించినంత కాలం విలువలతో కూడిన రాజకీయాల ద్వారా ప్రజలకు సేవలందించి దేశంలోని నాయకులందరికీ ఆదర్శంగా నిలిచిన గొప్ప నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ విఎస్ అచ్యుతానందన్ అని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సిపిఎం నాయకుడు, బాలాపూర్ మండల సిఐటియు అధ్యక్షుడు దాసరి బాబు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని బాలాపూర్ క్రాస్ రోడ్స్‌లో మహనీయుల విగ్రహాల వద్ద అచ్యుతానందన్ సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి బాబు తదితరులు ఆయన చిత్రపటానికి పుష్పాంజలితో ఘన నివాళులర్పించారు. అనంతరం బాబు మాట్లాడుతూ ఎలాంటి అవినీతికి పాల్పడకుండా నిస్వార్థంగా ప్రజల కోసం పని చేసిన అచ్యుతానందన్‌ను ప్రతి ఒక్క రాజకీయ నాయకుడు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకుడు కోరింకల నర్సింహ, మీర్‌పేట్ కార్యదర్శి సుంకోని యాదగిరిచారి, సిఐటియు నాయకులు శేఖర్ యాదవ్, లేబర్ అడ్డా అధ్యక్షుడు వీరయ్య, బిసిడబ్ల్యూ నేతలు దాసరి నర్సింహ, శంకరయ్య, నిరంజన్, మోహన్, టి.విజయ్, వెంకయ్య, మల్లికార్జున్, మధు, మహిళా కామ్రేడ్లు బన్నీ, అమ్ములు, లక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

## కనుల పండువగా ఫలహారం బండ్ల ఊరేగింపు



ఫలహారం బండ్ల ఊరేగింపుకు హాజరైన కామేష్‌రెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్ తదితరులు

**సరూర్‌నగర్, జూలై 22 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ కమలానగర్ కాలనీలో నవ భారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు స్థానిక పురవీధుల్లో పోతరాజుల నృత్యాల నడుమ అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపును కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కర్మన్ ఘాట్ హనుమాన్ టెంపుల్ మాజీ డైరెక్టర్ ఎరుకల వెంకటేశ్ గౌడ్, జిల్లెలగూడ నాయకులు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సిద్దాల భరత్ తదితరులను యూత్ కమిటీ సభ్యులు మాదరి రమేష్, చిన్న, రాము, సాయి, స్వామి, అశోక్, లప్ప లక్ష్మణ్ తదితరులు సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.



ఆగస్టు 3న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరిగే వైశ్య రాజకీయ రణభేరికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాచం సత్యనారాయణ ,తదితరులు